
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం



# భాషను కోల్పోతే భవిష్యత్తు లేదు!

**- తనికెళ్ల భరణి**


ఆయన కవి, రచయిత, నటుడు, దర్శకుడు, ప్రయోక్త. వీటికి మించి పరమ శివ భక్తుడు. 'భూమిపై మూడొంతుల నీరు! మిగతాది కన్నీరు' అనగలిగిన ప్రవక్త. హాస్య లాస్యాలు ఎరిగిన వ్యక్తి. ధరణికి పర్యాయపదం భరణి. తనికెళ్ల భరణి అంటే సహనానికి మారుపేరు. సాహిత్యానికి పెట్టింది పేరు. క్షణం తీరిక లేని సినిమా నటుడయినా సృజనాత్మక ఆర్తితో 'ఎందరో మహానుభావులు' ను స్పృశించిన వాడు. 'పరికిణీ' ని దర్శించిన వాడు. ఆ అక్షర నవ్య సాచితో కథలూ...కబుర్లు మీకోసం!!

## ★ బాల్యంలో కథలు బాగానే విన్నాను!

మా అమ్మగారి పేరు లక్ష్మీ నరసమ్మ. మా నాన్నగారి పేరు తనికెళ్ల వేంకట సుబ్రహ్మణ్య సేతు రామలింగేశ్వర రావు. మేం ఏడుగురు సంతానం. నేను నాలుగో వాణ్ణి. మా మూడో అన్నయ్య సూరిబాబు బాగా కథలు చెప్పేవాడు. చీకటి పొద్దుల్లో, చద్దన్నాల వేళ వాడు కథలు చెబుతుంటే అంతా శ్రద్ధగా సరదాగా వినే వాళ్ళం. అన్నయ్య లేనప్పుడు కథలు నేను చెప్పే వాణ్ణి. కథలు చెబుతూ వింటున్న వాళ్ళ కంచా ల్లోంచి చల్ది ముద్దలు తస్కరించేవాణ్ణి. అప్పుడు నా వయసు పదేళ్ళు.

## ★ నేను చదివిన మొదటి కథ

చాలా మంది చదివినట్టుగానే నేను కూడా చిన్నప్పుడు 'చందమామ'నే చదివాను. అందు



వంశీ ఇంటర్నేషనల్ సత్కార సభలో భార్య, తల్లిదండ్రులతో...

లోని భేతాళ కథ...నేను చదివిన మొదటి కథగా నాకు గుర్తు. ఆ కథ చదువుతున్నప్పుడు నన్ను నేను మరచిపోయాను. ఏదో అద్భుత లోకంలోకి ప్రయాణిస్తున్నట్టుగా అనిపించింది. కథ చదవడం పూర్తయినా తిరిగి రావాలనిపించలేదు. అది మొదలు నేను చాలామంది రచనలు చదవడం ప్రారంభించాను. మా ఇంటి ఎదురుగా మీనన్ అని ఓ మలయాళీ ఉండేవాడు. ఆయన లైబ్రేరియన్. ఆయన్ని ఆశ్రయించి '80 రోజుల్లో భూ ప్రదక్షిణం' ముళ్ళపూడి వారి అనువాదంతో పాటు మపాసా, ఓహెన్రీ కథలన్నీ చదువుకున్నాను. ఇంటర్ చదువుతున్నప్పుడు చలం సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. అదో ఉప్పెన. ఆ ఉప్పెనలో కొట్టుకుపోతూ 'జీవితాదర్శం' నవల చదివి అందులోని 'లాలస' పాత్రను చూడడానికి భీమిలీ పరిగెత్తాను. దానికి ముందే శ్రీపాద వారి 'గులాబీ అత్తరు' కథ చదివి, అత్తరు సీసాని సాయెబు పగలగొట్టిన చోటు...అమరావతి చూడాలనిపించి అక్కడికి వెళ్ళాను. చూశాను. ఇప్పటికీ అక్కడ అత్తరు వాసన వేస్తోంది. అయితే దాన్ని ఆఘ్రాణించేందుకు ముక్కు కన్నా మన సుండాలని తెలుసుకోగలగాలి.

## ★ నా మొదటి కథ

నిరుద్యోగం. చేతిలో పైసా లేదు. దాంతో ఆ రోజుల్లో కథలు రాయాలనిపించింది. కథలు రాస్తే...అవి ప్రచురణకో, ప్రసారానికో నోచుకుంటే డబ్బులొస్తాయని ఆశ! ఆ ఆశతోనే కథలు రాశాను. అప్పట్లో రేడియో యువవాణిలో ప్రయాగ వేదవతి గారని ఉండేవారు. ఆవిడకు నా కథలు నచ్చి బాగా ప్రోత్సహించారు. నా మొదటి కథ 'ఇద్దరూ నిద్దరోలేదు'. ఇందులో కథాంశం ఏంటంటే భార్యాభర్తలిద్దరూ ఒకరి కష్టాలు ఒకరు తలచుకుంటూ...బాధపడుతూ రాత్రంతా నిద్రపోకపోవడం. ఈ కథ బాగుందని అప్పట్లో చాలా మంది చెప్పారు. తర్వాత 'పొయ్యిలో పిల్లి' అని ఇంకో కథ రాశాను. ఇదీ బాగుందన్నారు. అంతే! అప్పట్నుంచీ తరుచూ కథలు రాయడం ప్రారంభించాను. అప్పటి ఆంధ్ర జ్యోతి వీక్లీలో నా 'మరణ శాసనం' కథకి సెకెండ్ ప్రైజ్ వచ్చింది. నోబుల్ ప్రైజ్ వచ్చినట్టుగా ఆనందించాను. ఆ డబ్బుల్తో నేనూ, నా స్నేహితులు 'ఛాయ్' తాగి సినిమాకు వెళ్ళాం. ఆ రోజంతా పండగలా ఫీలయ్యాం.

## ★ రచయితలంటే బాగా ఇష్టం

తల్లావఝుల వారి కుటుంబంతో నాకు బాగా పరిచయం ఉంది. తల్లావఝుల పతంజలి, సుందరం, శివాజీ...వాళ్ళందరూ రచయితలే! వాళ్ళను కలిస్తే చాలు! సాహిత్యం గురించే సంభాషణంతా సాగేది. శివాజీ అబ్‌స్ట్రాక్ట్ కథల గురించి బాగా మాట్లాడేవాడు. దాంతో నేనూ అబ్‌స్ట్రాక్ట్ కథల పట్ల మోజు పెంచుకున్నాను. చెప్పదలచుకున్నదేంటంటే... చిన్నప్పటి నుంచి రచయితలంటే నాకు చాలా ఇష్టం. రచయిత అంటే చాలు! అతన్ని ఆసక్తిగా చూసేవాణ్ణి.

## ★ నాకు నచ్చిన కథ

నాకు బాగా నచ్చిన కథ చలంగారి 'ఓ పువ్వు పూసింది'. ఆ కథ చదువుతుంటే పువ్వు పరిమళంతో పాటు ఆ పువ్వుకున్న నాజూకుతనాన్ని కూడా మనం ఫీలవుతాం. ఇప్పటికీ ఆ కథ నన్ను వెంటాడుతోంది. అసలా శైలి...అబ్బో! అదో ప్రవాహం. ఆనందంగా అందులో కొట్టుకుపోవాల్సిందే!

## ★ కథలు ఆలోచింపజెయ్యాలి!

కథ చదవడం పూర్తయిందంటే...ఆనందంతోనో, బాధతోనో కళ్ళు చెమర్చాలి. 'భలే కథ' అని ఆ కథను గురించిన ఆలోచనలలో మనం ఉన్నప్పుడు చదివినప్పటి అనుభూతి పదేపదే మనకు అందాలి. దీంతో బాటు మనలాంటి మామూలు మనిషిని ఆ కథ 'మనీషి'ని చేసే ప్రయత్నం చెయ్యాలి. అనుభూతితో పాటు ఆలోచింపజేసే కథలంటేనే నాకు ఎక్కువ ఇష్టం. అందుకే శ్రీపాద వారి చిన్న కథలంటే నేను ప్రాణం పెడతాను.

## ★ కథల ప్రభావం...

రామాయణ, భారత, భాగవతాలు భగవంతుని ఉనికిని తెలియజేస్తాయేగాని, 'ఇదిగిడుగో భగవంతుడ'ంటూ వేలెత్తి చూపించవు. అలాగే మనం చదివిన మంచి కథల ప్రభావం మన మీద ఉంటుంది. అందులో అనుమానం లేదు. అయితే 'ఇదిగిదిగో ఇలా ఉంద'ని స్పష్టంగా చెప్పలేం. గొప్ప వ్యక్తిత్వాన్ని అలవరుచుకోవడంలో గొప్ప కథల పాత్ర ఉంటుంది. సందేహం లేదు. ఉదాహరణకి ఎవరినైనా శ్రీరాముడే ముందుగా పలకరించేవాట్ట! రామాయణం చదువుకున్నప్పుడు తెలుసుకున్నాను. దాన్ని నేను నా జీవితంలో ఆచరించి చూశాను. మంచి ఫలితాలే వచ్చాయి. వస్తున్నాయి. కథలేవయినా సరే! మంచివికాని, చెడువికాని మనిషి మీద తప్పని సరిగా ప్రభావాన్ని చూపిస్తాయి. చూపించవనుకోవడం పొరపాటు! 'అవి ఉత్త కథలు! అవి మనల్నేం చేస్తాయి' అనుకోవడం తెలివితక్కువతనం!!

## నచ్చినవి

| | |
|---|---|
| కథ | : శ్రీపాద వారి 'గులాబీ అత్తరు' |
| రచయిత | : ఇంకెవరు? శ్రీపాదవారే! |
| సినిమా కథ | : మాయా బజార్ |
| సినిమా కవి | : పింగళి |
| పాట | : నీ కోసమె నే జీవించునది... |
| గాయకుడు | : ఘంటశాల |
| గాయని | : ఎస్.జానకి |
| నచ్చిన నవల | : ఏడు తరాలు ('రూట్స్' కి తెలుగు అనువాదం) |
| మిత్రుడు | : కీర్తి శేషులు దేవరకొండ నరసింహ కుమార్ |
| బంధువు | : మా పిన్ని కొడుకు తాండూరి ప్రకాశ్ |
| దైవం | : శివుడు |



'సముద్రం' చిత్రానికి ఉత్తమ విలన్‌గా నంది అవార్డు అందుకుంటూ...

### ★ నన్ను నేను వెతుక్కుంటాను!

కథ చదువుతున్నానంటే ఈ కథలో నేను న్నానా? అని ముందు కథలో నన్ను నేను వెతుక్కుంటాను. నా బలాలూ, బలహీనతలు, అందాలు, ఆనందాలు, అభిరుచులు, బాధలు, తిరుగుబాట్లు...ఏమున్నాయన్నది పట్టిపట్టి చూస్తాను. నన్ను నేను 'ఐడెంట్ ఫై' చేసుకునేందుకు ప్రయత్నిస్తాను. ఉంటే ఆనందిస్తాను. లేకపోతే బాధపడనుకాని 'టైం వేస్ట్ చేశానే' అనుకుంటాను. ఎక్కడో అక్కడ కథ మన జీవితాన్ని స్పృశించాలి. జీవితాన్ని కాదనుకునే కథలు నాకు నచ్చవు.

### ఇది మన కథే!?

తెలుగు కథ ఇప్పుడు తన సహజత్వాన్ని కోల్పోయి రంగు, రుచి, వాసన లేకుండా పోయింది. వర్గాలు, వాదాలు, వర్ణాలుగా విడిపోయింది. పదిమందిని కలపాల్సిన కథ పది రకాలుగా వేరయిపోయి బిక్కు బిక్కుమంటోంది. తెలుగు కథలో తెలుగుదనం కరవయిపోయింది. ప్రపంచీకరణ నేపధ్యంలో తెలుగు కథ పాశ్చాత్యీకరణ పాలై 'ఇది మన కథేనా' అనిపిస్తోంది. బాధనిపిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు కథ ఎలా ఉండాలంటే ఆ కథలో తెలుగు ఉండాలి. చాలు!!



... భార్యా పిల్లలతో...

### ★ ఆ ఆనందం, అనుభూతే వేరు!

ఈనాటి సమాజానికి కథల అవసరం చాలా ఉంది. మంచి మనసు కోసం, మానవ సంబంధాల కోసం కథలు చదవాలి. భాషను కోల్పోతే భవిష్యత్తు లేదు. ఇది గుర్తెరిగి పఠనాసక్తిని పెంచుకోవాలి. వానని, వెన్నెలని, తాజ్‌మహల్‌ని ప్రత్యక్షంగా చూసినప్పటి కంటే చదివినప్పుడు వాటిని ఆనందించే తీరు వేరు! అనుభూతించే తీరు వేరు! పాత చొక్కా వేసుకో! కొత్త పుస్తకం కొనుక్కో అన్నారుకాని, పాత చొక్కా వేసుకో! కొత్త టీవి కొనుక్కో అని ఎవరూ అనలేదు. అనరు కూడా! ఏదయినా ప్రింట్ మీడియా మజానే వేరు.

### ★ కొస మెరుపు

నా శ్రీమతి భవానికి నేను చాలా కథలు చెప్పాను. చెప్పిన ఆ కథలన్నీ ఆత్మ సంరక్షణార్థమే చెప్పాను. నా ఆత్మారాముడికి వైన్ అంటే ఇష్టం. తాగితే భవానికి నచ్చదు. ముఖం ముడుచుకుంటుంది. అందుకని పెళ్ళికి ముందు పెద్ద యాక్సిడెంట్ అయిందని, తలకి చిన్న చిన్న గాజు పెంకులు గుచ్చుకున్నాయని...ఆపరేషన్ చేసి వాటిని తొలగించినా ఇప్పటికీ తలనొప్పి వస్తోందని, దాన్ని పోగొట్టుకోవాలంటే అప్పుడప్పుడు వైన్ తాగాలని...ఇది డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అని ఓ మంచి కథ చెప్పాను. ఈ కథను తాను నమ్మిందో, నమ్మినట్టు నటించిందో తెలీదుగాని అప్పుడప్పుడు నా వైనానికి అడ్డుతగలకుండా ఉంటోంది. ఆనందంగా ఉంది.

**–జె.ఎస్.**

**నాకు నచ్చిన నా కథ**

# నింగి నుంచి నేలకు

- తనికెళ్ల భరణి

ఓ తెల్లార గట్ట నాకు జ్ఞానోదయం అయింది.
అదెల్లా అయిందీ అంటే-
ములగచెట్టు కింద కూర్చుని పళ్ళు తోముకుంటుంటే వీపు మీద గొంగళిపురుగు పడింది.
వొళ్ళంతా కంపరవెత్తింది. కెవ్వున కేకేస్తే, నాలుగిళ్ళ చావిడీ జనం వచ్చి 'ఏవయిందీ' అన్నారు.
"గొం... గొం... గొం..." నోట మాట రావట్లేదు!
"పాము కుట్టిందేమో" మళయాళీ యాసలో పై పోర్షన్‌లో కుర్రాడు..



పాము కుట్టడం ఏమిటీ నా బొంద... వెధవ తెలుగు! తేలు కొరకడం, చీమలు కరవడం, చెప్పులు కాటెయ్యడం అనుకున్నా.

"గొంగళిపురుగు పాకింది..." అన్నాను!

"జెళ్ళా - తెర్రులూ పాకుతాయ్... అందట్టైపా" అన్నాడు మళయాళీ!

'ఓరి నీ మొహం మండా! 'ముప్ఫైరోజుల్లో తెలుగుభాష' పుస్తకం కొన్నట్టున్నాడు' అనుకున్నా..

"గొంగళిపురుగా! భవిష్యత్తులో అదే సీతాకోక చిలకవుతుంది. మరేం పరవా లేదు" అన్నాడు ఆప్టిమిస్టు...

వీపు మీద తట్టు తేలింది... రూమ్‌లోకొచ్చా మందు రాసుకుందామనుకున్నా... అంది చావదాయె! వెధవ వీపు.... వెనకే పెట్టాలా... దేవుడి మీద విసుక్కున్నా... ఇదే పెళ్ళాం వుంటే.... ఈపాటికి...భోరున ఏడుస్తూ... వీపు మీద ఏమలామో రాసేది సుతారంగా! వొళ్ళో తలెట్టుకునీ.... పడుకుందును కమ్మగా... అనిపించి నిట్టూర్చా! సరే... అందరికీ అంత అద్భుతమైన పెళ్ళాలు దొరకొద్దూ! అంచేత అర్జెంటుగా పెళ్ళాల్ని వేటాడాలి! అని నిర్ణయించుకున్నా... ...అసలు దాంపత్యం ఎలా ఉండాలి! అదర్శ దాంపత్యానికి మార్గదర్శక సూత్రమేది... వెంటనే తాపీ ధర్మారావుగారి 'పెళ్ళి పుట్టుపూర్వోత్తరాలూ...' చలం గారి పుస్తకాలు... 'మేరెజెస్ ఆర్ మేడిన్ హెవెన్', 'షాదీకీ బాత్'... వగైరా పుస్తకాలు... తెగ కొని అర్ధరాత్రుళ్లు వేడి వేడి చాయ్ తాగుతూ కంఠతా పట్టా!

ఊహు... సుఖం లేదు! 'పెళ్ళనేది పెద్ద కాంప్రమైజు' 'మేరేజ్ ఈజ్ లాటరీ....!' వగైరా కొటేషన్స్ తగిలాయ్.... అబ్బా.... పోనీ కొన్ని ఫామిలీస్‌ని... అంటే కొంత మంది దంపతుల్ని దగ్గర్నుంచి పరిశీలిస్తే! బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది! నేనుంటున్నది మేడ మీద పోర్షను! గది నిండా... కృష్ణశాస్త్రి.... శ్రీశ్రీ... బాపుగారి బొమ్మలూ.... అక్కడక్కడా... పెన్సిల్‌తో పాల ఖాతాలు... విరిగిపోయిన హార్మోనియం. డెబనీర్‌లోంచి చింపి అంటించిన 'నగ్న సుందరీ మణులు' అగరొత్తుల పొగ చూరిపోయిన వెంకటేశ్వర స్వామి....

వేయేల అచ్చం... బ్రహ్మచారి గాడి కొంప! పడమరవైపు కిటికీ తెరిచా! ఎదురుగుండా ఓ పోర్షను! అందులో కొత్త దంపతులు... వాళ్ళు నాకు స్పష్టంగా కనపడ్డమే కాకుండా... లీలగా మాటలు వినబడతాయ్...! రాత్రి తొమ్మిదయింది! నా గదిలో లైటు ఆర్పేసి.... కిటికీ పక్కగా కూర్చున్నా... సిగరెట్ మాత్రం వెలుగుతోంది! వాళ్ళ పేర్లేమిటో గాని - ఇద్దరూ వచ్చారు... నాలో టెన్షన్ మొదలు... వాళ్ళ గది చాలా నీట్‌గా వుంది. చక్కటి మంచం - టేప్ రికార్డరూ.... కలర్ టీవీ... చిన్న ఫ్రిజ్! ... ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది.... పిరుదుల దాకా జుట్టు... చక్కటి పలువరస... కమ్మటి కంఠం. నుదుట మీద దోసగింజ బొట్టు.... కళ్లు.... ఓహో... అందమంతా అందులోనే వుంది.... ఆ కుర్రాడే అందమైనవాడూ! లుంగీ కట్టుకుని, సిగరెట్ వెలిగించుకుని టేప్ రికార్డర్ ఆన్ చేశాడు! 'పంకజుదాస్' గజల్.... చాలా లీలగా వినిసిప్తోంది! ఆ అమ్మాయి వెనకనుంచి వచ్చి.... మెడ మీద నించి కావలించుకుని... నుదుటి మీద 'ప్చ్' ముద్దెట్టుకుంది...

నాకు కళ్ళు అంటుకున్నాయ్!! యస్! దాంపత్యమంటే అదీ!!

పైగా చలం గారి పుస్తకాలు ఔపాసన పట్టేసి ఉన్నానేమో!!

ఫ్రీలౌ నరనరాల్లోను పట్టేసింది!! మొగుడూ పెళ్ళాలూ అంటే! రవివర్మ పెయింటింగుల్లాగ...

గువ్వ పిట్టల్లాగా... వినీలాకాశంలో వెలిగే నక్షత్రల్లాగా రెండు అద్భుతమైన కవితల్లాగా.. ఒకే దీప స్తంభంలాగా ఉండాలి.

అంతేగాని-

"ఏవండీ పిల్లాడికి జలుబు చేసింది!"



''పెద్దదానికి టాన్సిల్స్‌ట!''

''పొద్దునే గ్యాస్ అయిపోతే... కిరసనాయిల్ స్టౌవ్ మీద ఉడకేశా!! మావగారి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది... బహుశా డబ్బులేవన్నా కావాలేమో!! అయినా... ఉత్తరాలు యింకెందుకొస్తాయి లెండి!!''

...వగైరా... చెత్త కొశ్చెన్లు... మోస్ట్ అన్‌పొయిటిక్ బిహేవియరూ!

ఛా.... పెళ్లావంటే

క్లియో పాత్రలా ఉండాలి! అమ్రపాలీలా ఉండాలి! రేఖలా ఉండాలి! లైలాలా ప్రేమించాలి! పార్వతిలా బెంగెట్టుకోవాలి!

పెద్ద అందగత్తె అక్కర్లేదు గానీ – ఆకర్షణ లేకపోతే ఎలాగ!!

మళ్ళీ... ఎదురింటివైపు చూశా!!

ఇద్దరూ... నవ్వుకుంటున్నారు!

అతని నోట్లో సిగరెట్ చాలా నాజుగ్గా లాక్కుంది ఆ పిల్ల!!

తన పెదాల మధ్య పెట్టుకుంది!!

కుర్రాడు సిగరెట్ లైటర్‌తో వెలిగించాడు!

ఆ అమ్మాయి సుతారంగా పీల్చింది! ఆ పిల్ల కళ్ళల్లో చిత్రమైన కాంక్ష! పొగ వదుల్తోంది....

కుర్రాడు... అంతే నాజుగ్గా! ఆ అమ్మాయి పెదాల మీద ముద్దెట్టుకున్నాడు. నాలుగు పెదాల మధ్య నుంచి... సన్నగా సిగరెట్ పొగ!

ఓష్... అదీ.... అదీ ముద్దంటే!!

అంతేగానీ – ఓష్... ''నాకు సిగరెట్టు పడదుబాబూ.... నోరుని ఫినాయిల్‌తో కడుక్కురండి!'' అనే భార్యల్ని చూస్తే... వళ్ళు మండదూ!!

శభాష్.... కారీ ఆన్!! చూస్తూన్నా...

అలా యిద్దరూ చెరో రెండు దమ్ములు కొట్టి అవతల పారేశారు!!

ఆ సిగరెట్ పీకని తెచ్చి.... కళ్ళుకద్దుకుని నెత్తిమీద పెట్టుకోవాలని... ఓ అద్భుతమైన ముద్దుకి ప్రత్యక్ష సాక్షి ఆ పీక!!

ఆ పిల్ల... స్కాచ్‌విస్కీ బాటిల్ ఓపెన్ చేసింది!!

గ్లాసులోకి ఒంపింది సుతారంగా!!

నాకు గబుక్కున ఉమర్‌ఖయ్యాం గుర్తుకొచ్చాడు!!

తర్వాత గాలిబ్ గుర్తుకొచ్చాడు! ముద్దుకృష్ణ ముద్దుపళని ఇద్దరూ గుర్తుకొచ్చారు!! ఎప్పుడో రాసుకున్న కవిత గుర్తుకొచ్చింది!

ప్రళయమే తెంచి ఈ భూ వలయమంత అంతమౌనన్న చింత నాకింత లేదు!

ఒడిని చేర్చి కరుణతో సేదతీర్చి మధువులందించు చెలియ నాచెంత లేదు!!

వాహ్వా!! ఓష్ – వాళ్ళూ దంపతులంటే! అదీ కాపరం అంటే!!

అతనో సిప్ కొట్టాడు! ఆ పిల్ల పెదాలకందించాడు!

ఆ పిల్ల మత్తుకళ్ళతో చూస్తూ అమృతంలాగా చప్పరిస్తోంది!!

అప్రయత్నంగా ... అతను ఒళ్ళో తలెట్టి ఏడవడం మొదలెట్టాడు!

అ అమ్మాయితో పాటు... నేను ఆశ్చర్య పోయాను!!

ఆ అమ్మాయి జుట్టులోకి వేళ్ళూ పోనిచ్చి లేవనెత్తింది!

చాలా ఆప్యాయంగా కన్నీళ్ళు తుడిచింది!

తడి కళ్ళని ముద్దెటుకుంది!

ఆ అమ్మాయి పెదాలమీద.... కన్నీటి తడి!!

'ఏమైంది?'

'నేను నీకు ద్రోహం చేశాను!'

నవ్వింది...

'నిజం... మొన్నరాత్రి ఇంటికి రాలేదు గదా! ఆ రోజున... ఓ అమ్మాయితో గడిపాను.' మొహం దాచుకున్నాడు చేతుల్లో.

అంతే! గ్లాసు బద్దలయింది–

'యూ రోగ్... యూ చీట్! నేనింత ప్రేమిస్తోంటే... నన్ను మోసం చేస్తావా? ఐ విల్ కిల్‌యు బాస్టర్డ్!'... అని సీసా బద్దలు కొట్టింది!

.... అనుకున్నా.... ఊహూ... కాదు... కానేకాదు!!

'ఓస్ యింతేనా!' మెడ మీద పొంగిన నరం మీద ముద్దెట్టుకుంది!!

'దానికే యింత ఫీలింగ్!'... ఎలా అంది.

ఓహూ... పెళ్ళాం అంటే అలా ఉండాలి. అంత అర్థం చేసుకున్నదాన్ని చేసుకోవాలి! నిజంగా! ఆడది అంటే అది! తెగ మెచ్చేసుకున్నా...

'డోంట్ ఫీల్‌యార్!.... బాధపడకు! ఆ లెక్కన నేను ప్రతి సండే... ఫుల్ డే!! మా బాస్‌తో గడుపుతా! నువ్వెప్పుడైనా కొశ్చన్ చేశావా?' అంది.

చెంప పేలిపోతుందేమో అనుకున్నా..

'ఈజిట్' గట్టిగా కావలించుకున్నాడు!

## కథాంతరంగం



ఎవరికైనా పెళ్ళికి ముందు పెళ్ళి గురించి, భార్య గురించి, కాపురం గురించి చాలా కలలూ, కోరికలు ఉంటాయి. భార్యంటే నచ్చిన సినిమా హీరోయిన్‌లా ఉండాలినీ, మనం మెచ్చినట్టుగా ప్రవర్తించాలని అనుకుంటాం. తెలిసీ తెలియని తీరులో రకరకాలుగా ఊహించుకుంటాం. నిండు చందమామను చూస్తూ, పందిరి మీద నుంచి పాకి వచ్చిన సన్నజాజి తీవెను సుతారంగా పట్టుకుని, అటు తిరిగి ఉన్న భార్య భుజమ్మీద చేయి వేస్తే ఆమె మత్తుగా కళ్ళు మూసి, గుండెలు పొంగించి, కింది పెదవిని మునిపంట కొరకాలని సినిమాటిక్‌గా అనుకుంటాం. నిజ జీవితంలో అలా ఉండదు. జరగదు. అది తెలుసుకోవడం అత్యవసరం. అది తెలియకే పెళ్ళికి ముందు ఈ కథను రాశాను. దెబ్బకి పెళ్ళయిపోయింది.

'యు ఆర్ గ్రేట్' అన్నాడు.,

'యు ఆర్ ఫెంటాస్టిక్' అందామె!

'నవ్వ హిమాలయాలంత ఉన్నతురాలివి. మనల్ని అర్థం చేసుకోడం ఎవరికి చేతనవును. నాకు నువ్వూ నీకు నేనూ ఉయ్ ఆర్ గ్రేట్' అన్నాడు.

'ఆకాశమంత ఎత్తు ఎదిగిపోయిన నీతో నన్ను పోల్చకు' అందామె!!

ఇలా ఒకరినొకరు పొగుడుకుంటూ కావలించుకున్నారు!!

నేను కిటికీ తలుపుల్ని ధడాల్ని వేసేశా!

ఓరి వీళ్ళ దాంపత్యం తగలడా!

అది సంసారమా సాని కొంపా!

అతను 'దాంతో పోయానే క్షమించు' అంటే...

ఈ పీనుగు... 'బాస్‌తో పోయా్నా'... అంటుంది!!

నా బుర్ర తిరిగిపోయింది...

ఛా ఏదో నవల్లోనో... సినిమాలోనో అయితే బాగుంటుంది కానీ!

మరీ యింత బరితెగించి బతగ్గలమా!

పొయిట్రీలేదూ... గాడిదగుడ్డూ లేదు!!

వద్దు!.... ఇన్‌లాండ్ లెటర్ మొదలెట్టా...

'మహారాజశ్రీ నాన్నగారికి... కాకినాడ పిల్లకి పెద్ద చదువు లేదన్నారు! అయినా... పర్లేదు!... సంబంధం ఖాయం చెయ్యండి!!'

*